# సుందరాంగి

## సి.ఎస్.చంద్రశేఖర్

పోలీస్ స్టేషన్ వెలుపల బైక్ పార్క్ చేసి లోపలికి నడవబోతున్న విక్రమ్ అప్పుడే ఆటో దిగుతున్న ఆ అమ్మాయిని చూశాడు. చూశాక కళ్ళు తిప్పుకోలేక పోయాడు. చాలా అందంగా ఉంది ఆ అమ్మాయి. ఆటోకు డబ్బులిచ్చి తను కూడా స్టేషన్ వైపే నడవడం చూసి ఆశ్చర్యపోయాడు.



''ఈ సుందరాంగికి పోలీస్ స్టేషన్‌లో పనేమిటో'' అనుకున్నాడు. ముందుగా తనే స్టేషన్‌లోకి ప్రవేశించి సి. ఐ. ప్రశాంత్ ఎదురుగా నిలబడి ''నమస్తే సార్'' అన్నాడు వినయంగా.

తల వంచుకుని ఫైలు చూస్తున్న ప్రశాంత్ పరధ్యానంగా తల పంకించి, నెమ్మదిగా తలెత్తి చూసి ''అరె విక్రమ్ నువ్వా? అంత వినయంగా నమస్కారం పెడితే ఎవరో అనుకున్నాను. రా కూర్చో'' అంటూ తన ఎదురుగా ఉన్న కుర్చీ చూపాడు.

''అక్కడ సుందరాంగి కూర్చుంటుంది. నేను ఇక్కడ కూర్చుంటాను'' అంటూ ఓ కుర్చీ ప్రశాంత్ ప్రక్కగా లాక్కొని కూర్చున్నాడు.

''సుందరాంగి ఎవరు?'' ప్రశాంత్ అర్థం కానట్లు మొహం పెడుతూ అన్నాడు.

''సార్ మీతో మాట్లాడాలని ఓ అమ్మాయి వచ్చింది'' కానిస్టేబుల్ వచ్చి చెప్పాడు ప్రశాంత్‌తో. ప్రశాంత్ విక్రమ్ వైపు చూశాడు.

''ఆవిడ గురించే నేను చెప్పింది'' అన్నాడు విక్రమ్.

''ఆవిడ నీకు తెలుసా?''

''తెలియదు నేను స్టేషన్‌లోకి ఎంటరవుతున్నపుడు చూశాను''

''లోపలికి పంపించు'' అన్నాడు ప్రశాంత్ కానిస్టేబుల్‌తో. కానిస్టేబుల్ వెళ్ళిపోయాడు.

''అంత బాగుందా ఆవిడ?'' ప్రశాంత్ విక్రమ్‌ని అడిగాడు.

''నువ్వే చూస్తావుగా''

లోపలికి అడుగుపెట్టిన ఆ అమ్మాయిని చూడగానే '' ఈమెకి విక్రమ్ పెట్టిన పేరు పూర్తిగా సరిపోతుంది'' అనుకున్నాడు ప్రశాంత్. పాతికేళ్ళుంటుంది ఆమె వయసు. ఆమె ధరించిన టీషర్టు, జీన్స్ ప్యాంటు అందాల్ని దాచలేక పోతున్నాయి.

''నమస్తే, నా పేరు స్మిత''

''నమస్తే కూర్చోండి'' కుర్చీ చూపించాడు ప్రశాంత్.

ఆమె కూర్చొని ''మీతో కొద్దిగా మాట్లాడాలి'' అంది.

''మాట్లాడండి'' స్క్రిబ్లింగ్ ప్యాడ్, పెన్ సిద్ధంగా ఉంచుకొని అన్నాడు ప్రశాంత్.

''మా అన్నయ్య వినయ్ ముంబయిలో ఉంటున్నాడు. ఎం.ఎస్.సి. చదివి అక్కడ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు. నాకు అమ్మా, నాన్నా యిద్దరూ లేరు. నా సర్వస్వం మా అన్నయ్యే. నేనంటే మా అన్నయ్యకు కూడా ఎంతో ప్రేమ. నాకు ఫోన్ చెయ్యకుండా ఒక్కరోజు కూడా ఉండలేడు. అటువంటిది అతను నాకు ఫోన్ చేసి పదిహేనురోజులవుతూంది. నా కెందుకో భయంగా ఉంది''.

''మీరు మీ అన్నయ్యకు ఫోన్ చేయ్యలేదా?''

''అన్నయ్య సెల్‌కు గంటకోసారి చేస్తూనే ఉన్నాను. స్విచ్ ఆఫ్ చేసి ఉందని జవాబు వస్తూంది'' ఆమె కళ్ళనీళ్ళతో అంది.

''ముంబయిలో అతని అడ్రస్ మీకు తెలుసా?''

''తెలియదు ఫోన్‌లో రోజూ మాట్లాడుకునే వాళ్ళం కనుక అడ్రస్ అవసరం రాలేదు. నేనూ ముంబయి వెళ్ళలేదు యింతవరకూ. చెంబూర్‌లో గది తీసుకున్నానని మాత్రం చెప్పాడోసారి''.

''మీ అన్నయ్య ఫోటో ఉందా మీ దగ్గర?'' విక్రమ్ అడిగాడు.

ఉందని తలూపి పర్సు తెరచి ఓ కార్డు సైజు ఫోటో ప్రశాంత్‌కిచ్చింది. ప్రశాంత్ చూసి విక్రమ్‌కిచ్చాడు. విక్రమ్ పరిశీలనగా చూశాడు ఆ ఫోటోని. సైడ్ పోజులో తీయబడింది ఆ ఫోటో. అందంగా ఉన్నాడతను. ఫోటో మళ్ళీ చూసి

ప్రశాంత్‌కిచ్చాడు విక్రమ్?

"మీ అన్నయ్య ఎక్కడ చదివాడు?" ప్రశాంత్ ఆమెని అడిగాడు.

"హైదరాబాదులోనే నిజాం కాలేజీలో చదివాడు. బి.ఎస్.సి. కాగానే ఉస్మానియాలో ఎం.ఎస్.సి చదివాడు. పోయినేడాది అతని చదువు పూర్తయింది. వెంటనే ముంబయిలో ఓ కంపెనీ నుంచి యింటర్వ్యూకు కాల్‌లెటర్ వచ్చింది. అయితే ఆ ఉద్యోగం మా అన్నయ్యకు రాలేదు. ముంబయిలో ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటాయని అక్కడే ఉండిపోయాడు" చెప్పింది స్మిత.

"ఎం.ఎస్.సిలో మీ అన్నయ్య సబ్జెక్ట్ ఏది?" విక్రమ్ అడిగాడు.

స్మిత చెప్పింది.

"మీరు హైదరాబాద్‌లోనే చదివారా?"

"అవును నిజాం కాలేజీలో బి.కాం. పూర్తి చేశాను కంప్యూటర్ కోర్సులు చేస్తున్నాను ప్రస్తుతం".

"మీ తల్లిదండ్రులు ఎప్పుడు పోయారు?" ప్రశాంత్ అడిగాడు.

"మా నాన్న పదేళ్ళ క్రిందటే పోయారు. అమ్మ పోయి రెండేళ్ళవుతూంది".

"మరి మీ జీవనం?"

"కష్టంగానే ఉంది. అన్నయ్యకు ఉద్యోగం దొరికితే పరిస్థితి కొంత మెరుగుపడుతుందని నా ఆశ. ఇంతలో యీ సమస్య వచ్చింది. అన్నయ్య ఏమయ్యాడు అన్న ప్రశ్న నన్ను కలిచివేస్తూంది. ఎక్కడున్నా నాకు ఫోన్ చేయకుండా ఉండడు".

ఆమె ఏడుస్తూంది. ఆమె ఏడుపు వాళ్ళిద్దరి మనసుల్నీ కదిలించింది.

"ప్లీజ్ ఏడవకండి. మీ అన్నయ్యకు ట్రేస్ చెయ్యడానికి మా శక్తి కొద్దీ ప్రయత్నిస్తాం. మీరు కంప్లైంట్ రాసివ్వండి. మీ అడ్రసు, మీ ఫోన్ నెంబరు, మీ అన్నయ్య సెల్ నెంబరు మర్చిపోకుండా రాయండి నేను ముంబయి పోలీసులతో మాట్లాడుతాను. మీరు ధైర్యంగా ఉండండి" అన్నాడు ప్రశాంత్.

స్మిత కళ్ళు తుడుచుకుని, కంప్లైంట్ రాసిచ్చింది. తర్వాత ఇద్దరికీ "థ్యాంక్స్" చెప్పి సెలవు తీసుకుంది.

"ఐ పిటీ దట్ గర్ల్" ఆమె వెళ్ళిన వైపే చూస్తూ అన్నాడు ప్రశాంత్.

విక్రమ్ "ఐ టూ పిటీ హర్" అన్నాడు.

***

"స్పందన డిటెక్టివ్ ఏజన్సీ" ఆఫీసులోకి అడుగుపెట్టిన ప్రశాంత్ రిసెప్షన్‌లో ఉన్న విక్రమ్ అసిస్టెంట్-రోజాతో "ఏం చేస్తున్నాడు మీ బాసు?" అని అడిగాడు.

"కేసులు సంపాదించడం ఎలా? అని ఆలోచిస్తున్నారు" నవ్వుతూ చెప్పింది.

ప్రశాంత్ కూడా నవ్వాడు.

తన గదిలో ప్రవేశించిన ప్రశాంత్‌ను చూసి "అరె ప్రశాంత్. ఇది కలా నిజమా?" అంటూ ఆశ్చర్యపోయాడు విక్రమ్.

"ఒకసారి చేతిమీద గిల్లుకో - తెలుస్తుంది" అంటూ కుర్చీలో కూర్చున్నాడు ప్రశాంత్.

"కాఫీ ఆర్ కూల్‌డ్రింక్?"

"ఏదీ వద్దు. నీతో ఓ పనుండి వచ్చాను"

"నాకు తెలుసు ఊరక రారు కదా మహానుభావులు. అన్నట్టు ఆ సుందరాంగి కేసు ఏమైంది? వాళ్ల అన్నయ్య దొరికాడా?"

"లేదు. అతను చనిపోయినట్లు ఆధారాలు దొరికాయి"

"మైగాడ్ ఎలా పోయాడు అతను?"

"ఈ మధ్య ముంబయిలో విపరీతంగా వానలు కురిసి చాలామంది గల్లంతయ్యారు కదా. వారిలో ఇతను కూడా ఒకడు. అతని సెల్, ఎయిర్ బ్యాగ్ రెస్క్యూ టీముకు దొరికిందట. నేను ముంబయి పోలీసులకు యీ కేసు వివరాలు చెప్పిన రెండు రోజుల్లోనే నాకు ఆ విషయం ఫోన్ చేసి చెప్పారు".

"ఆ విషయం స్మితకి చెప్పావా?"

"చెప్పాను పాపం చాలా ఏడ్చింది. ఆమెను సముదాయించడం నావల్ల కాలేదు"

"పోనీలే నీకు ఓ కేసు క్లోజ్ అయింది"

"నిజమే కాని యింకో కేసు మొదలయ్యేలా ఉంది"

ఏమిటన్నట్టు ఆశ్చర్యంగా చూశాడు విక్రమ్?

"నిన్న స్మిత స్టేషన్‌కు వచ్చి ఎఫ్.ఐ.ఆర్. కాపీ కావాలని అడిగింది"

"ఎందుకుట?"

"తన అన్నయ్యపేరుమీద ఓ ఇన్సురెన్స్ పాలసీ ఉందట. దాన్ని క్లెయిమ్ చేయడానికట"

"ఎంతకు చేశారు పాలసీ?"

"యాభై లక్షలకు"

ఉలిక్కిపడ్డాడు విక్రమ్. "యాభై లక్షలకా? ఆర్ యు ష్యూర్?" ఆశ్చర్యంగా అడిగాడు ప్రశాంత్‌ని.

"అఫ్‌కోర్స్ ఐ ఆమ్ ష్యూర్. పాలసీ జెరాక్స్ కాపీ చూశాను"

"తనే తీసుకున్నాడా పాలసీ?"

"కాదు పదిహేను సంవత్సరాల క్రితం వాళ్ళ నాన్నగారు వినయ్ పేరు మీద తీసుకున్నారు"

"మరి వినయ్ నాన్నగారు స్మిత పేరు మీద కూడా పాలసీ తీసుకున్నారా?"

"లేదు వినయ్ పేరు మీద మాత్రమే తీసుకున్నారు"

"వెరీ యింటరెస్టింగ్"

ఇద్దరూ రెండు నిమిషాలు మౌనంగా ఆలోచిస్తూండిపోయారు. తర్వాత ప్రశాంత్ విక్రమ్‌తో "విక్రమ్ నీవు ఏమనుకొంటున్నావు యీ కేసు గురించి" అని అడిగాడు.

"ఐ సస్పెక్ట్ సమ్‌థింగ్ రాంగ్"

"అంటే స్మిత తన అన్నయ్యను తానే చంపి ఉంటుందంటావా?"

"ఉండవచ్చు డబ్బు చెడ్డది. అది ఎటువంటి నీచమైన పనులనయినా చెయిస్తుంది"

"ఛ అలా మాట్లాడకు ఆ అమ్మాయి అంత దుర్మార్గురాలిలా కనిపించడం లేదు. పైగా అన్నయ్యను చంపిన చెల్లెళ్ళు నా సర్వీస్‌లో నేను ఎప్పుడూ చూడలేదు"

"అన్నయ్య పేరుమీద యాభై లక్షల పాలసీ ఉన్న చెల్లెళ్లు కూడా నీవు యిదివరకు చూడలేదు కదా?"

ప్రశాంత్ నవ్వాడు. కొంతసేపటి తర్వాత.

"నాకు యింకో ఆలోచన వచ్చింది. ఒకవేళ వినయ్ బ్రతికుండి, అతను చనిపోయినట్లు స్మిత అందర్నీ నమ్మించి, పాలసీ మొత్తం వచ్చాక యిద్దరూ పంచుకొని ఉడాయించాలనుకుంటున్నారేమో" అన్నాడు విక్రమ్?

"ఆ అవకాశం మాత్రం ఉంది. వినయ్ కావాలనే తన సెల్, బ్యాగ్ పోలీసులకు దొరికేలా అక్కడ పెట్టి ఉండొచ్చు"

"అదే నిజమైతే వినయ్ ఎక్కడ దాక్కొన్నాడో కనుక్కోవాలి".

"అవును ఆ ఇన్స్యూరెన్స్ కంపెనీ ఎం.డి నాతో మాట్లాడారు. తన డిపార్ట్‌మెంట్‌లోని మనుషుల ద్వారా ఎంక్వయిరీలు ఎటూ ఉంటాయని, యీలోగా ఓ ప్రైవేటు డిటెక్టివ్ చే రహస్యంగా పరిశోధన చేయిస్తానని అన్నారు. నేను నీ పేరు సజెస్ట్ చేశాను. ఆయన 'ఓకే' అన్నారు."

"థ్యాంక్యూ ప్రశాంత్" సంతోషంగా అన్నాడు విక్రమ్.

"నీ మీది నమ్మకంతో యీ కేసు ఛేదిస్తావని ఆయనకు హామీ యిచ్చాను. నా గౌరవం నిలపడం నీ చేతిలో ఉంది"

"తప్పకుండా ఈ రోజు నుంచే ఆ పనిలో ఉంటాను"

"ఈ మధ్య ముంబయిలో విపరీతంగా వానలు కురిసి చాలామంది గల్లంతయ్యారు కదా. వారిలో ఇతను కూడా ఒకడు. అతని సెల్, ఎయిర్ బ్యాగ్ రెస్క్యూ టీముకు దొరికిందట. నేను ముంబయి పోలీసులకు యీ కేసు వివరాలు చెప్పిన రెండు రోజుల్లోనే నాకు ఆ విషయం ఫోన్ చేసి చెప్పారు"

***

స్నానం చేసి హాల్లోకి వచ్చిన విక్రమ్ సెల్ రింగయితే ఆన్ చేసి "హలో" అన్నాడు.

"హలో విక్రమ్ ఏమయ్యావు యిన్ని రోజులూ?" ప్రశాంత్ అడిగాడు.

"నేను ముంబయి వెళ్ళి యీ రోజు ఉదయమే వచ్చాను"

"ఈ రోజు ఇన్స్యూరెన్స్ కంపెనీ స్మితకు పేమెంట్ చెయ్యబోతూంది. కంపెనీ రూల్స్ ప్రకారం క్లెయిమ్ అప్లికేషన్ అందుకున్న ఆరునెలలలోగా కేసు సెటిల్ చెయ్యాలట. ఈ రోజు ఆఖరి రోజు కాబట్టి ఆమెను ఆఫీసుకు వచ్చి యాభై లక్షల చెక్కు తీసుకోమని చెప్పారుట"

"ఎన్ని గంటలకు పేమెంట్ చేస్తారు?"


"పదకొండు గంటలకు"

"అయితే నువ్వు, నలుగురు లేడీ కానిస్టేబుల్స్ మఫ్టీలో అక్కడ ఉండండి. పదకొండు గంటలకు నేను అక్కడ ఉంటాను"

"ఎనీ బ్రేక్ యిన్ ది కేస్?" కుతూహలంగా అడిగాడు ప్రశాంత్. "తినబోతూ రుచి అడగటం ఎందుకు. పదకొండు గంటలకు నువ్వే చూస్తావుగా"

***

చెక్కు చేతిలోకి తీసుకున్న స్మిత కళ్ళు ఆనందంతో మెరిశాయి.




''చెక్కు మీకు అందినట్లు యిక్కడ సంతకం చేయండి'' ఇన్స్యూరెన్స్ కంపెనీ అధికారి ఆమె ముందు ఓ రిజిస్టర్ పెట్టి చెప్పాడు స్మిత సంతకం చేసింది.

''అదేమిటి స్మితగారూ మీకు ఎడమ చేతి వాటం కదా మరి కుడి చేత్తో సంతకం చేయడం ఎప్పుడు నేర్చుకున్నారు?'' అన్నాడు అప్పుడే లోపలికి అడుగుపెట్టిన విక్రమ్?

ఆమె కళ్ళు పెద్దవి చూసి విక్రమ్ వైపు చూసింది. ఆమె చేతులు వణకసాగాయి.

''నేను ముంబయి వెళ్ళి అన్నీ తెలుసుకుని వచ్చాను డాక్టర్ మల్హోత్రాతో కూడా మాట్లాడాను. మీరు తప్పు ఒప్పుకుంటే శిక్ష తగ్గుతుంది'' అన్నాడు విక్రమ్, కఠినంగా ఆమె వైపు చూస్తూ.

ప్రశాంత్ లేచి విక్రమ్ ప్రక్కనే నిలబడ్డాడు. ప్రశాంత్‌ను చూడగానే మరింతగా వణికి పోసాగింది స్మిత.

''నేను చేసింది తప్పే...తప్పే'' అంటూ ఏడవసాగింది.

విక్రమ్ తను తెలుసుకున్న విషయాల్ని ఇన్స్యూరెన్స్ కంపెనీ ఎం.డి. మాధవరావుకు, ప్రశాంత్‌కు చెప్పాడు. స్మిత తన నేరం అంగీకరించింది. ప్రశాంత్ ఆమెను అరెస్ట్ చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించాడు.

***

ఆ గది పత్రికా విలేఖరులతో, టీవీ రిపోర్టర్లతో క్రిక్కిరిసిపోయి ఉంది. వాళ్ళ ఎదురుగా విక్రమ్, ప్రశాంత్, మాధవరావు కూర్చుని ఉన్నారు.

''చెప్పండి సార్. ఎలా సాల్వ్ చేశారు యీ కేసుని?'' చాలామంది విలేఖరులు ఒకేసారి అడిగాడు యీ ప్రశ్నని.

విక్రమ్ నవ్వుతూ ''మాధవరావుగారు నాకు ఈ కేసు అప్పజెప్పాక నేను రొటీన్‌గా చేసే ఎంక్వయిరీలు చేయసాగాను. ముందుగా స్మిత చదివిన కాలేజీకి వెళ్ళి ఆమె క్లాస్‌మేట్స్ చిరునామాలు సంపాదించాను. దాదాపు ముప్ఫైమంది ఆమెతో కలసి చదివితే కేవలం ఐదుమంది మాత్రమే ప్రస్తుతం సిటీలో ఉన్నారు. ఆ అయిదుమందిలో యిద్దరు స్మితతో చాలా సన్నిహితంగా మెలగినవాళ్ళు. వాళ్ళు ఒక విలువైన సమాచారం యిచ్చారు నాకు'' అన్నాడు.

అందరూ కుతూహలంగా అతన్నే చూడసాగారు.

''స్మిత ఎడమ చేతి వాటం ఉన్న వ్యక్తి. తను కుడి చేత్తో రాయలేదు. కానీ ఆమె కుడి చేత్తో కంప్లైంటు రాసి ప్రశాంత్ కివ్వడం నాకు బాగా గుర్తు. అప్పట్నుంచీ స్మితను అనుమానించసాగాను. ఆ అమ్మాయిలను వినయ్ గురించి అడిగినప్పుడు మరో కీలకమైన సమాచారం లభించింది. వినయ్, స్మిత కవల పిల్లలు. ఆ విషయం స్మిత ప్రశాంత్‌తో చెప్పలేదు. ''వినయ్ ఫోటో ఉందా'' అని నేను అడిగితే అతను సైడ్‌ఫోజులో ఉన్న ఫోటో యిచ్చింది. బహుశ తాము కవలపిల్లలమని మాకు తెలియకూడదనే ఆమె ఆ ఫోటో యిచ్చిందని తర్వాత అర్థమైంది నాకు''.

''ఆ తర్వాత వినయ్ స్నేహితుల్ని కలిసినప్పుడు వాళ్ళు కూడా వినయ్, స్మిత కవలపిల్లలని చెప్పారు. ఆ రోజుల్లో వినయ్ 'ఫలక్‌నుమ' నుండి కాలేజీకి వచ్చేవాడని చెప్పారు. నేను వెంటనే 'ఫలక్‌నుమ' వెళ్ళాను. అక్కడ వినయ్ కుటుంబం నివసించిన యిల్లు కనుక్కొన్నాను. ఆ యింటి ఎదురుగా ఉన్న యింట్లో నివసిస్తున్న వినయ్ తండ్రి చిదానందరావు స్నేహితుడు నసీర్ అహ్మద్‌ను కలిశాను. ఆయనతో మాట్లాడాక విషయం మొత్తం క్లియర్‌గా అర్థమైంది నాకు''

''ఆయన ఏం చెప్పారు మీతో'' ఉత్సాహం ఆపుకోలేక ఓ లేడీ జర్నలిస్ట్ అడిగింది.

''చిదానందరావు కుటుంబంలోని మగవాళ్ళను గత మూడు తరాలుగా క్యాన్సర్ వ్యాధి బాధిస్తోంది. చిదానందరావు తాత, తండ్రి క్యాన్సర్ బారిన పడి మరణించారు. నలభై ఏళ్ళ వయసప్పుడు చిదానందరావుకూ క్యాన్సర్ సోకింది. అతను బాగా ఆలోచించి, వినయ్ పేరుతో యాభై లక్షలకు పాలసీ తీసుకుని ప్రీమియం మొత్తం ఒకేసారి చెల్లించాడు. నామినీగా స్మిత పేరు రాశాడు. ఒకవేళ వినయ్ కూడా క్యాన్సర్ బారిన పడి మరణిస్తే స్మిత దిక్కులేనిదవుతుందని, ఆ యాభై లక్షలు ఆమెకు చేరితే ఆమె జీవితం హాయిగా సాగిపోతుందని ఆయన ఆలోచించి ఆ పని చేశాడు.

ఇంతవరకూ నసీర్ అహ్మద్ చెప్పారు. తరువాత ఏం జరిగి ఉంటుందో నేను ఊహించాను. ఆ దిశగా నా ప్రయత్నాలు సాగించాను. ఆశ్చర్యంగా నేను ఏది ఊహించానో అదే జరిగింది''

ఒక్క నిమిషం ఆగాడు విక్రమ్. టేబుల్ మీదున్న మంచినీళ్ళ గ్లాసు అందుకుని నీళ్ళు త్రాగాడు. హాలంతా నిశ్శబ్దంగా ఉంది. విక్రమ్ ఏం చెబుతాడో అన్న కుతూహలంతో అందరూ అతనివైపే ఉత్కంఠతో చూడసాగారు.

విక్రమ్ మళ్ళీ చెప్పడం ప్రారంభించారు.

''అయితే చిదానందరావు ఊహించినట్లు క్యాన్సర్ వినయ్‌కు రాలేదు. స్మితకు వచ్చింది. ఏడాది క్రితం స్మిత మరణించింది''

అందరి కళ్ళలో ఆశ్చర్యం, బాధ కనిపించింది అతనికి.

''వినయ్ ఎం.ఎస్.సి. పూర్తి చేసినా ఉద్యోగం రాలేదు. తండ్రి సంపాదించింది అతని ట్రీట్‌మెంట్‌కూ, తర్వాత స్మిత ట్రీట్‌మెంట్‌కీ ఖర్చయిపోయింది. అతనికి రోజులు గడవడం కష్టమపోయింది. అప్పుడు అతనికి తండ్రి తన పేరు మీద చేసిన ఇన్సూరెన్స్ పాలసీ గుర్తొచ్చింది. దాంతో పాటు ఓ ఆలోచన కూడా వచ్చింది. ''తను, స్మిత కవలపిల్లలు కనుక యిద్దరూ చూడ్డానికి ఒకేలా ఉంటారు. తను సెక్స్ మార్పిడి చేసుకుని ఆడదానిలా మారితే అచ్చం స్మితలా కనపడతాడు. స్మిత ఎటూ చనిపోయింది. వినయ్ చనిపోయినట్లు ఆధారాలు సృష్టించగలిగితే ఇన్సూరెన్స్ మనీ స్మిత రూపంలో ఉన్న తనకు వస్తుంది. ఆ డబ్బుతో జీవితాంతం హాయిగా బ్రతికేయ్యవచ్చు'' అనుకున్నాడు వినయ్. సెక్స్ మార్పిడి చేసే డాక్టరు తన స్నేహితుడి తండ్రే కావడంతో అతనితో మాట్లాడి, పాలసీ మొత్తం తన చేతికొచ్చాక తన ఫీజు చెల్లిస్తానని మాట యిచ్చి, ఆపరేషన్ చేయించుకుని స్మితలా మారాడు. ఆ తర్వాత కథ మీకు తెలిసిందే''

అందరూ అవునన్నట్లు తలూపారు.

''స్మితకు క్యాన్సర్ వచ్చిందని మీకెలా తెలిసింది?'' ఓ విలేఖరి అడిగాడు.

''నేను స్మితగా చెప్పుకుంటున్న వినయ్ యింటిని సోదా చేసినప్పుడు ఫ్లోరింగ్ లోపల ఏర్పాటు చేసుకున్న ఓ రహస్యపు అరలో స్మిత తాలూకు హాస్పిటల్ బిల్లులు, ప్రిస్క్రిప్షన్లు కనిపించాయి. అందులోనే వినయ్ సెక్స్ మార్పిడి చేసుకున్నట్లు నిరూపించే హార్మోన్ల ప్రిస్క్రిప్షన్లు కనిపించాయి. వెంటనే నేను అందులోని అడ్రస్ నోట్ చేసుకుని, ముంబయి వెళ్ళి, డాక్టర్ మల్హోత్రాని కలిశాను. మొదట అతను బుకాయించాడు. వినయ్ అరెస్ట్ అయ్యాడని, మాకు అన్ని విషయాలు చెప్పాడని నేను చెప్పగానే భయపడి నిజం ఒప్పుకున్నాడు.

నా దృష్టిలో డబ్బులు సంపాదించాలనుకోవడం తప్పు కాదు. కాని కష్టపడకుండా అక్రమ మార్గాన సంపాదించాలనుకోవడం తప్పు. ఆ తప్పుకు శిక్ష తప్పదు''

ప్రెస్ మీట్ ముగిసింది. అందరూ విక్రమ్‌ని అభినందించసాగారు.

మాధవరావు విక్రమ్‌కు చేయందిస్తూ ''మా కంపెనీని యాభై లక్షల ఫాల్స్ క్లెయిమ్ నుంచి రక్షించారు. మీ ఋణం యీ జన్మలో తీర్చుకోలేను'' అన్నాడు.

''నా బిల్లు పే చేస్తే మీ ఋణం తీరిపోతుంది'' అన్నాడు విక్రమ్.

అందరూ నవ్వారు.